క్లుప్తంగా

రెండో రోజూ నిరవధిక సమ్మె



మాట్లాడుతున్న మేకల దాసు

పాతమంచిర్యాల: కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజూ చేరింది. శుక్రవారం సమ్మె శిబిరంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు మాట్లాడారు. నేషనల్ హెల్త్‌స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులు 16 ఏళ్లుగా ప్రజల ప్రాణాలు కాపాడుతూ సేవలందిస్తున్నారని, వారికి కనీస వేతనం ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపు, ఉద్యోగులు మహేందర్, రాజేశ్వరి, సురేఖ, పావణి సమత, సుగుణ, కాండోజీ, పార్వతమ్మ, నర్సక్క, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి, సమ్మయ్య

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం నుంచి మద్దికల్ వరకు రూ.1.08 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కొడిపె సమ్మయ్య శుక్రవారం ప్రారంభించారు. బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు వెంకట్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

వాసవి వారోత్సవాలు ప్రారంభం



సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ వాసవిక్లబ్‌ను స్థాపించిన కేసీ గుప్తా జయంతి సందర్భంగా మంచిర్యాల వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం వాసవి వారోత్సవాలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారిని సన్మానించారు. ముక్తా శ్రీనివాస్, కొండ చంద్రశేఖర్, కటకం హరీష్, అప్పాల శ్రీధర్, పుల్లూరి బాలమోహన్, కోఆర్డినేటర్ రాచర్ల చంద్రశేఖర్, పల్ల కిరణ్ కుమార్, కాచం సతీశ్, కేశెట్టి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై, కౌన్సిలర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 13 వార్డు శివారులో ఓ కుంటవద్ద అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని మహిళను కాపాడి మానవత్వం చాటుకున్నారు ఎస్సై రవికుమార్, కౌన్సిలర్ బండి ప్రభాకర్. వార్డులోని గంగారాంనగర్ బస్తీ వెనకాల ఉన్న కుంట వద్ద గుర్తు తెలియని మహిళ స్పృహ తప్పి పడిఉన్నట్లు స్థానికులు గుర్తించారు. కౌన్సిలర్ ప్రభాకర్‌కు సమాచారం అందించారు. ఆయన టూటౌన్ ఎస్సై రవి కుమార్‌కు విషయం తెలిపారు. ఇద్దరూ కలిసి ఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న మహిళను స్వయంగా పైకి లేపారు. అంబులెన్స్‌ను రప్పించి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. మానవతాదృక్పథంతో వ్యవహరించిన ఎస్సై, కౌన్సిలర్‌ను పలువురు అభినందించారు.

'ఓట్ల కోసం మభ్యపెడుతున్న ప్రభుత్వం'

జన్నారం: ఎన్నికల సమీపిస్తున్నందున ఓట్ల కోసం సీఎం కేసీఆర్ తాయిళాలు ప్రకటిస్తూ మభ్యపెడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలెందర్ అలీఖాన్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందడం లేదని, కొందరితో ప్రారంభించి, అక్కడికే ముగిస్తున్నారని ఆరోపించారు. మండలం పూర్తి వ్యవసాయ అధారిత ప్రాంతమైనందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని కోరారు. పోడు భూములకు పట్టాలు పంపిణీలో అనేక మందికి అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, మండల నాయకుడు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మృత్యుగోదారి

- గూడెం గోదావరి వద్ద పెరుగుతున్న బలవన్మరణాలు
- రక్షణ చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు

దండేపల్లి: మంచిర్యాల-జగిత్యాల, జిల్లాల సరిహద్దు ప్రాంతమైన దండేపల్లి మండలం గూడెం వద్ద పవిత్ర గోదావరి నది ప్రవహిస్తోంది. నది ఇవతలి వైపు గూడెం, అవతలి వైపు జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం తీరాలు ఉంటాయి. ఇక్కడ నిత్యం పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇటీవల ఈప్రాంతంలో బలవన్మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వివిధ కారణాలతో నదిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడి, వారి వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దులో గోదావరి నదిపై నిర్మించిన ఈ వంతెన బలవన్మరణాలకు కేంద్రంగా మారింది. ఆగస్టులో ఇద్దరు విద్యార్థులు, ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతంలో ఓ వృద్ధ జంట నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలా ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు చాలా మంది బలవన్మరణాలకు పాల్పడటంతో ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందో అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంచె ఏర్పాటు చేస్తే కొంత నివారణ

వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలకు ఎత్తయిన కంచెలు ఏర్పాటు చేయడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలను కొంతవరకు నివారించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ దిశగా అధికారులు ఆలోచించాలని పలువురు కోరుతున్నారు.

మత్స్యకారులే దిక్కు



గూడెం వద్ద మంచిర్యాల-జగిత్యాల సరిహద్దులో గోదావరి పై వంతెన

ప్రత్యేక చర్యలు చేపడుతాం

గూడెం గోదావరినది వద్ద ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతాం. ఇందుకోసం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారి సూచనల మేరకు, బ్లూకోల్ట్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తాం. ఆత్మహత్యల నివారణ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చావడం సమస్య కాదు. సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలి. వాటి పరిష్కారానికి తమవంతు కృషిచేస్తాం. నది వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. వీలైతే మరిన్ని చర్యలు చేపట్టి, ఆత్మహత్యలను నివారిస్తాం.

– కృష్ణ, సీఐ, లక్సెట్టిపేట

నదిలో మత్స్యకారులు చేపలు వేటాడే సమయంలో ఎవరైన దూకితే వారు గమనిస్తే మాత్రం నదిలో దూకి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఓ మహిళ నీటిలో దూకడం గమనించిన మత్స్యకారులు ఆమె ప్రాణాలు కాపాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాధితులను కాపాడేందుకు ఇక్కడ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సీపీఎస్ రద్దు చేయాలి



కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పత్తి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బన్న రవీందర్ తెలిపారు. టీయూటీఎఫ్ నాయకులు శుక్రవారం ఐడీఓసీలో కలెక్టరేట్ పీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 సెప్టెంబర్ 2014 తర్వాత నియామకమైన కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిందని అన్నారు. సీపీఎస్ రద్దు అయ్యే వరకు టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. చిన్నయ్య, తిరుపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్టీ యూటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. చుంచు లక్ష్మణ్, కృష్ణకాంత్, శ్రీనివాస్, రామకృష్ణ, నర్సింగరావు, దిగంబర్, సునిత, పద్మజ పాల్గొన్నారు.



భీమారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు తదితరులు

భీమారం: పాతపెన్షన్ పునరుద్ధరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు నేతృత్వంలో ఉపాధ్యాయులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మహేశ్, విజయ్‌కుమార్ ఉన్నారు.

కోటపల్లి: ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దేవులవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం కూల్చివేతపై రాస్తారోకో

జన్నారం: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలో నిర్మించిన కల్యాణ మండపం కూల్చివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ మండపాన్ని కూల్చివేయడం సరికాదన్నారు. భక్తుల సౌకర్యార్థం కోసం నిర్మించిన కల్యాణ మండపాన్ని రెవెన్యూ అధికారులు అక్రమంగా కూల్చివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ వనజారెడ్డిని సంప్రదించగా సర్వే నంబర్ 374లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణం



రాస్తారోకో చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘు నాయకులు

చేపట్టడంతో కూల్చివేశామన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదన్నారు. సంఘ నాయకులు గంగాధర్, వెంకటేశ్, రాంచంద్రం, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

లక్సెట్టిపేట: 18 ఏళ్లునిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాములు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు కార్డుల్లో ఏవైనా తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఈనెల 2,3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. మండలంలో మొత్తం 47 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోలింగ్ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఆర్ఐ సంజీవ్, సిబ్బంది శివ, హరికృష్ణ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల పరిధిలోని 17 పంచాయతీల్లో 32 పోలింగ్ కేంద్రాల్లో ఈ శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

తాండూర్: ఈనెల 2,3 తేదిల్లో ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రోహిత్ ఓ ప్రకటనలో తెలిపారు. బీఎల్ఓలు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం నెంబర్ 6 సిద్ధంగా ఉంచుకోవాలని, వయోజనులు విధిగా ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు.

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు



మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

మంచిర్యాల తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి భోజన్న తెలిపారు. పట్టణంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌స్థాయి అధికారులు ముసాయిదా ఓటరు జాబితా, నూతన ఓటరు నమోదు, మార్పులకు సంబంధించిన ఫారం-6, ఫారం-8, తొలగింపునకు సంబంధించి ఫారం-7 అందుబాటులో ఉంటాయని వివరించారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓటరు జాబితా ప్రచురణ

తాండూర్: మండలంలో శుక్రవారం సవరించిన ఓటరు జాబితాను మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలలో ప్రచురించినట్లు తహసీల్దార్ రోహిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఎవరి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో, లేవో ఓటర్లు జాబితాను పరిశీలించి సరిచూసుకోవాలని తెలిపారు. జాబితాలో పేరు లేని వ్యక్తులు ఫారం నెంబర్-6 , ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడిన ఓటర్లు ఫారం నెంబర్ 7, పేర్లలో, వయస్సులో సవరణలు ఉంటే ఫారం నెంబర్ 8 నింపి అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇచ్చిన మాటతప్పలే !

- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు
- గ్రామాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ

దండేపల్లి: గత ఎన్నికలకు ముందు నుంచే మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట తప్పడం లేదని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ అన్నారు. మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం, మాకులపేట గ్రామాల్లో కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మహిళలకు చీరలు పంపిణీ చేస్తామన్నారు. తాము అధికారంలో ఉన్న లేకపోయిన నియోజక వర్గ ప్రజలకు తమ ట్రస్టు ద్వారా సొంత డబ్బులతో పేదలకు సేవ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తున్న తమకు ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి



తాళ్లపేటలో చీరలు అందిస్తున్న ప్రేంసాగర్‌రావు

ఓటేసి తమను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీటీసీలు హేమలత, శ్రీనివాస్, మోహన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, మండల యూత్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌కు మద్దతుగా తీర్మానం



తీర్మానం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జైపూర్: రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు మద్దతు తెలుపుతూ మండలంలోని రామారావుపేట ప్రజలు శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏకగ్రీవ తీర్మానం చేశారు. సర్పంచ్ నామాల సత్యవతి, ఎంపీటీసీ పెద్దల బాపు సమక్షంలో ప్రజలు మరోసారిగా బాల్కసుమన్‌ను ఎమ్మెల్యే గెలిపించుకుంటామని తీర్మాణం అందజేశారు. ప్రధానంగా చెరువు కట్టపై సింగిల్ రోడ్డును రూ.2.80 కోట్లతో డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశామన్నారు. నాయకులు ముదాం రమేశ్, తిరుపతి, బొద్దున జగ్గయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జైపూర్: కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా చేయాలని పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక తెలిపారు. మండలంలోని గంగిపల్లి గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించి స్థానిక ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో కలిసి కాలనీలో తిరుగుతూ వారి బాగోగులు తెలుసుకుని వారితో టిఫిన్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

జన్నారం: మండలానికి 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సామాజికవేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. శుక్రవారం తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్, పలువురు సంఘ నాయకులు దీక్షకు మద్దతుగా కూర్చున్నారు.

పరామర్శ

నస్పూర్: ఇటీవల ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి కాలి గాయమై హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావును ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6 గనిపై రిటైర్డ్ ఉద్యోగులు గడ్డం మల్లయ్య (ట్రామర్), సూర గుండయ్య(జనరల్ మజ్దూర్), నీలం మొగిలి(ట్రామర్), జెడ్డిగ రాజన్న (ట్రామర్)ను గని మేనేజర్ తిరుపతి శుక్రవారం సన్మానించారు. కాదాసి రవీందర్, కొమురయ్య, శ్యాం కుమార్, ఆర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టెస్టు క్యాంప్ నిర్వహించాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మయూరి ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం ఉచితంగా ఈడీ ఎకో గుండె పరీక్ష ఉచిత క్యాంప్ నిర్వహించాలని కోరుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందించారు. టుడి ఎకో టెస్టు ద్వారా ఐరన్ ఓవర్ ఎంతమేర ఉందో తెలుస్తుందన్నారు. డాక్టర్ గోపాలకృష్ణ, సుబ్బారాబహత్, రెడ్‌క్రాస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

చెన్నూర్: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఒడ్డెపల్లిలో శుక్రవారం గడప గడపకూ కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లగౌడ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు నిర్వహించండి

నస్పూర్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం రక్తదాన శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి కోరారు. జీఎం స్పందించినట్లు తెలిపారు. శిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

పత్తి పంట పరిశీలన

భీమారం: ఆరెపల్లి గ్రామంలోని పత్తి పంటలను ఏఈవో అరుణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇప్పటివరకు వర్షాలు సక్రమంగా లేని కారణంగా పత్తి మొక్కలు ఏపుగా పెరగలేదని రైతులు ఏఈవోకు వివరించారు. నీటి సదుపాయం ఉన్న రైతులు పంటకు ఇప్పటికైన నీటితడులు అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణంలోని 33 కేవీ లైన్ వర్క్ కారణంగా అన్ని వార్డుల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

మొక్కలు పంపిణీ

లక్సెట్టిపేట: పట్టణంలోని 14వ వార్డులో కాలనీవాసులకు కౌన్సిలర్ చింత సువర్ణ శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ కల్లెడ రాజశేఖర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి రాకేశ్, వార్డు ఆధికారులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: లింగంపల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర గొర్రె, మేకలపెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ అశోక్‌యాదవ్, సర్పంచ్ అంగ లక్ష్మి, రమేశ్ ఉన్నారు.

కార్యవర్గం

కాసిపేట: రొట్టెపల్లి పంచాయతీలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంద్రం హన్మంతు, ఉపాధ్యక్షుడిగా సుర్పం రామకృష్ణ, కార్యదర్శి చిక్రం దశ్వంత్ ఎన్నికయ్యారు. సభ్యులుగా గణపతి, కుర్సింగ జలపతి, కుర్సింగ తిరుపతి, పెంద్రం తిరుపతి, టేకం భీము, కుర్సింగ గంగులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదుగుల నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సోహైల్‌ఖాన్, దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా ఎం.సాయివిష్ణు, సుజాత, నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటి, సహాయక కార్యదర్శులుగా సతీశ్, మల్లేశ్, సుమన్, ఎండీ సలీం, ప్రచార కార్యదర్శులుగా రమేశ్, ఎండీ సాదిక్, జ్యోతి, కోశాధికారిగా సత్తయ్య ఎన్నికయ్యారు.

కూరగాయల వ్యాపారుల సంఘం..

చెన్నూర్: పట్టణ కూరగాయల వ్యాపారుల సంక్షేమ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోడు శంకర్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, మల్లు, కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా గొనె సతీశ్ ఎన్నికయ్యారు.

పోషణమాస సంబురాలు

తాండూర్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాదారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణమాస సంబురాలు ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత పాల్గొన్నారు.

15 నుంచి గ్రామాల్లో మట్టి సేకరణ

తాండూర్: నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణానికి ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి తాండూర్ మండల బీజేపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిని నియమించినట్లు తెలిపారు. కృష్ణదేవ రాయలు, రాజులాల్‌యాదవ్, చిరంజీవి, భరత్ పాల్గొన్నారు.

సీపీఐ ఇంటింటా ప్రచారం

బెల్లంపల్లి: సీపీఐ ఇంటింటా ప్రచారం కొనసాగుతోంది. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ చేపట్టిన ప్రచారం శుక్రవారంతో 51 రోజుకు చేరుకుంది. ప్రచారపర్వంలో భాగంగా మున్సిపాలిటీలోని 14 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు వివరించారు. రాజమౌళి, జీసీ మాణిక్యం, లక్ష్మీనారాయణ, బాపు, రత్నం రాజం, బండారి శంకర్ పాల్గొన్నారు.

సేవలందించడంలో ఎల్ఐసీ అగ్రగామి

పాతమంచిర్యాల: దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రజలకు సేవలందించడంలో ఎల్ఐసీ అగ్రగామిగా నిలిచిందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజినల్ వైస్‌ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో 67వ బీమా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో సింగరేణి కార్మికులకు రెవెన్యూ సర్టిఫికెట్లు లేనప్పటికి క్లెయిమ్‌లు చెల్లింపు చేసి ప్రజాసేవలో ముందుందన్నారు. పాలసీదారులకు సేవలు అందించినందుకు ఎన్నో పురస్కారాలు సొంతం చేసుకుందన్నారు. ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ విశ్వేశ్వర్, మంచిర్యాల బ్రాంచ్ అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ భారతి, అసిస్టెంట్ మేనేజర్లు సురేంద్ర, మాలతిదేవి, ఫణిమోహన్, నరేశ్, మల్లేశ్, ఏజెంట్లు రాజబాబురెడ్డి, తిరుపతయ్య, తిరుపతిరెడ్డి, ఉద్యోగులు ఆర్.రాజేశం, శివరంజన్, పోచయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

సాదాసీదాగా మండల సమావేశం

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ విక్రంరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో వైద్య, అంగన్‌వాడీ, విద్యుత్ అధికారులు పనితీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దనపల్లి గిరిజన గూడెంలో విషజ్వరాలు ప్రబలుతున్న వైద్యులు పట్టించుకోవడం లేదని, లంబాడితండా(డి)లో విద్యుత్ స్తంభాలు తక్కువ లోతులో వేయడంతో పడిపోయే ప్రమాదం ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఏ అలీం, వైద్యాధికారి రవికిరణ్, విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత, ఎంఈవో వాసాల ప్రభాకర్, ఎంపీవో నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు సీట్లు కేటాయించాలి

పాతమంచిర్యాల: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గంగపుత్రులకు ఆరు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని వాడ బలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బోడంకి మహేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో గంగపుత్రులు 35 లక్షల మంది ఉన్నారని, బీఆర్ఎస్ పార్టీ కేటాయించిన ఎమ్మెల్యే టికెట్లలో గంగపుత్రులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందున్న గంగపుత్రులను విస్మరించడం బాధాకరమన్నారు. గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకులు వంగల దయానంద్, గుమ్ముల శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతం చేయండి

నస్పూర్: 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య తెలిపారు. ఎస్ఆర్పీ 3 గనిపై శుక్రవారం కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ కోలిండియాలోని బొగ్గు సంస్థలు ఈనెల 3న ఉద్యోగులకు ఏరియర్స్‌ని చెల్లిస్తున్నాయన్నారు. కాని ఉద్యోగులకు ఏరియర్స్ ఎప్పుడు చెల్లిస్తాయని సింగరేణి స్పష్టంగా తెలియజేయడం లేదన్నారు. బ్రాంచి అసిస్టెంట్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు నర్సింగరావు, అంబాల రవి, తవటం మల్లేశ్, రవీందర్, శ్రీకాంత్, పోశం, ఐలయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.